హైదరాబాద్ వార్త

# ట్రాఫిక్ కష్టాలు తీర్చడానికి పకడ్బందీ ప్రణాళికలు

-సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు
-జంక్షన్‌ల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఉన్నతాధికారుల నిర్ణయం
-ఎల్బీనగర్ జంక్షన్ తరహాలో సబ్‌వే, అండర్‌పాస్ నిర్మాణాల పరిశీలన
-త్రై కమిషనరేట్‌ల అధికారులు సమన్వయంతో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టాలనే యోచన



**పంజగుట్ట, అక్టోబర్ 5 9(ప్రభాతవార్త):** రోడ్డెంత బాగున్నా, ప్లైఓవర్ ఎక్కి జామ్ జామ్ అని పోతున్నా.. బండితీసి రోడ్డుమీదకు వచ్చామంటే ఏదైనా జంక్షన్ రాగానే ఉత్సాహం నీరుగారిపోతుంది. అడుగులో అడుగు వేస్తున్నట్లుగా, బంపర్ టు బంపర్ లా వాహనాలు నెమ్మదిగా కదులుతూ వాహనదారులకు ఎక్కడలేని చికాకు తెప్పిస్తుండడం నగరంలో మనం రోజూ చూస్తూనే ఉన్నాం. ఎడమ వైపు ఫ్రీలెఫ్ట్ ఉంటుందేమో అనుకుంటే ఇరుకైన జంక్షన్‌లు ఉన్నచోట అదీ కూడా ప్యాక్ అయిపోయి ఉంటుంది. ఏదోవిధంగా జంక్షన్ దాటి ప్లైఓవర్ ఎక్కుదామనుకుంటే అక్కడ కూడా జామ్ అయి ఉంటున్నది. దీంతో నగరంలోని ఉన్నతస్థాయి అధికారుల బృందం నగరంలోని జంక్షన్‌ల నిర్వహణపై ప్రత్యేక కార్యాచరణకు పూనుకుంది.

హైదరాబాద్ మహా నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతా విషయంగా తీసుకోవాలని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశంలో ఉన్నతాధికారులను ఆదేశించారు. లా అండ్ ఆర్డర్ పోలీసులను కూడా ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే సమయాలలో ట్రాఫిక్ కంట్రోల్ విధులకు ఉపయోగించుకోవాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని సిటీలో రహదారులు, జంక్షన్‌లపై అధికారులు దృష్టిపెట్టారు. రద్దీ ఎక్కువగా ఉండే జంక్షన్‌లలో ఎల్బీనగర్ జంక్షన్ తరహాలో సబ్‌వే, అండర్‌పాస్, సర్ఫేస్‌వే నిర్మాణాలు చేపట్టే అవకాశాలను పరిశీలిస్తున్నారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న సమయంలో ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థ మీద ఆధారపడకుండా ట్రాఫిక్ సిబ్బంది అక్కడే ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రతిపాదనలు వచ్చాయని అధికారులు అంటున్నారు.

పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా కుంచించుకుపోయిన రహదారులలో ఆక్రమణలను తొలగించి రహదారులను విశాలంగా చేయడంతో పాటు జంక్షన్‌లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీనికిగాను ట్రాఫిక్ విభాగంతో పాటు ఇతర శాఖల సమన్వయం అవసరమని గుర్తించి ఆయా శాఖల ఉన్నతస్థాయి అధికారులతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేయడంతో పాటు సమస్య ఎక్కడ ఉందో మూలాలను తెలుసుకుని పరిష్కార మార్గాలను కనుగొనాలని ప్రాథమికంగా ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ముందుగా జంక్షన్‌ల వద్ద ట్రాఫిక్ ఎక్కువ సేపు ఆగకుండా ఫుట్‌పాత్‌లను క్లియర్ చేయడం, పాదచారులు రోడ్లపైకి రాకుండా సిగ్నల్ పడినపుడు మాత్రమే రోడ్డు దాటే విధంగా సిబ్బంది చర్యలు తీసుకోనున్నారు. త్రీవేలు, చౌరస్తాలు, పెద్ద జంక్షన్‌లు ఉన్నచోట ముందుగా దృష్టిపెట్టి జంక్షన్‌లను అభివృద్ధి చేయాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే నగరంలోని ట్రాఫిక్ సమస్యలను గుర్తించి127కుపైగా జంక్షన్‌లను విస్తరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు...

### ప్లైఓవర్ దాటితే ఇప్పటికీ కష్టాలు తప్పడం లేదు...

నగరంలోని పలు ప్రాంతాలలో ప్లైఓవర్‌ల మీద ప్రయాణం సాఫీగా జరిగిపోతున్నా ప్లైఓవర్ దాటగానే ట్రాఫిక్ చికాకులు మరింత పెరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఉదాహరణకు కేబుల్ బ్రిడ్జ్ వైపు నుండి వేగంగా వచ్చే వాహనాలు జూబ్లీహిల్స్ రోడ్డునంబర్ 45 చౌరస్తాలో ఒక్కసారిగా జామ్ అవుతున్నాయి. అక్కడ ఇరుకైన జంక్షన్ ఉండడమే కారణమని అధికారులు ఇప్పటికే గుర్తించారు. అదేవిధంగా జూబ్లీహిల్స్ నుండి పంజగుట్ట ప్లైఓవర్ మీదుగా బేగంపేట, సికింద్రాబాద్ వైపు వెళ్ళాల్సిన వాహనాలు ప్లైఓవర్ కిందనుంచి ఖైరతాబాద్ దిశగా వెళ్ళాల్సిన వాహనాలు అన్నీ ప్లైఓవర్‌కు ముందు పంజగుట్ట చౌరస్తా వద్ద జామ్ అవుతున్నాయని అధికారులు గుర్తించారు. అధికారులు నగరంలో కీలక జంక్షన్‌లపై దృష్టిపెట్టడమే కాకుండా ఏయే ప్రాంతాలలో భారీ వర్షాలు కురిసినపుడు రహదారులపై వర్షపునీరు నిలిచిన కారణంగా ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయో గుర్తించారు. దాదాపు 160కి పైగా ప్రాంతాలలో ఈ సమస్య నగర రోడ్లపై ఉత్పన్నమవుతున్నట్లు గుర్తించారు. ఆయా ప్రాంతాలలో అన్ని శాఖల సమన్వయం అవసరమని కూడా ఉన్నతాధికారులు గుర్తించారు. అంతేగాకుండా త్రై కమీషనరేట్‌ల పరిధిలో ఒకదానికొకటి కనెక్టివిటీ ఉన్న కారణంగా మూడు కమీషనరేట్‌ల అధికారులు కూడా సమన్వయంతో వ్యవహరించాలని ఇప్పటికే ప్రభుత్వ పెద్దల నుంచి ఆదేశాలు వచ్చినట్లు సమాచారం.

# గుండెకు గండం..!

## -ఆరోగ్యంగానే కనిపిస్తూ కుప్పకూలిపోతున్న వైనం

**హైదరాబాద్, అక్టోబరు 5 ప్రభాతవార్త**

గుండెపోటు మరణాలు ఇటీవల బాగా ఎక్కువయ్యాయి. ప్రతి రోజూ ఎక్కడో ఓ చోట ఇలాంటివి వెలుగు చూస్తున్నాయి. చాలా హెల్దీగా ఉన్నవాళ్లు కూడా గుండెపోటుకు గురవుతున్న ఘటనలు తరచూ చూస్తున్నాం. ప్రముఖ సినీనటుడు రాజేంద్ర ప్రసాద్ కుమార్తె గాయత్రి 38 ఏళ్ల వయసులో ఛాతిలో నొప్పి కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. ఆమెకు ఛాతిలో నొప్పి రావడంతో శుక్రవారం ఏఐజీ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆమె చనిపోయారు. ఓ 20 ఏళ్ల ఇస్లావత్ సిద్దు అనే ఇంజనీరింగ్ విద్యార్థి గుండె ఆగింది. గుండెలో నొప్పితో ఒక్కసారిగా కుప్పకూలిన ఆ యువకుడిని తోటి విద్యార్థులు ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలోనే కన్నుమూశాడు. ఈ విషాదకర ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. యువకులు అకస్మాత్తుగా గుండెపోటుకు గురవుతున్నారు. నొప్పి తీవ్ర స్థాయిలో ఉంటుండటంతో ప్రాణాలు వదులుతున్నారు. కొందరు వ్యాయామం చేస్తూ అస్వస్థతకు గురై, ఆసుపత్రులలో చేరి మృతి చెందిన పలు ఉదంతాలు కనిపిస్తూనే ఉన్నాయి. ఛాతిలో ఇబ్బందిగా అనిపిస్తే చాలా మంది యువకులు సాధారణమేనని భావిస్తున్నారు. తలనొప్పి వస్తే సొంతంగా మందులు కొనుక్కొని వాడుతున్నారు. కడుపులో నొప్పి వస్తే అసిడిటీ అనుకొని ఇతర వైద్యుల వద్దకు వెళ్తున్నారు. కానీ ఛాతినొప్పిని గుండె సమస్య లక్షణాలని అంచనా వేయలేకపోతున్నారు. హార్ట్ ప్రాబ్లమ్ ఉంటే నడిచినా, బరువులు ఎత్తినా, మెట్లు ఎక్కుతున్నా,, జాగింగ్ చేస్తున్నా, ఛాతిలో నొప్పిగా అనిపిస్తుందని, అంతేకాకుండా చెమటలు విపరీతంగా పట్టడం.. వికారణంగా అనిపించడం.. ఊపిరి అందకపోవడం వంటి లక్షణాలు కూడా హార్ట్ ప్రాబ్లమ్స్‌గా గుర్తించి వేగంగా చికిత్స అందించాలని అంబర్‌పేటకు చెందిన డాక్టర్ ధనుంజయ పేర్కొంటున్నారు. దీంతో చికిత్స ఆలస్యమై ప్రాణాపాయ స్థితికి దారితీస్తోందని వైద్యులు చెబుతున్నారు. గుండె నొప్పి ఏ కారణం ఏ లక్షణంతో ఉంటుందో తెలియని పరిస్థితి కూడా దీనికి కారణమని కార్డియాలజిస్టులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం కార్డియోవాస్కులర్ జబ్బులు బాగా పెరిగాయి. ముఖ్యంగా మహిళల్లో బాధితుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది.

అసలు గుండెపోటు ఎందుకు జరుగుతుందో తెలుసుకుందాం.. అన్ని కండరాల్లాగే గుండె కండరాలకీ రక్తాన్ని సరఫరా చేసే ప్రధాన రక్తనాళాలు ఉంటాయి. వాటి ద్వారానే గుండెకు అందాల్సిన ఆక్సిజన్, పోషకాలు అందుతుంటాయి. ఒకవేళ కొవ్వు పేరుకోవడం వంటి కారణాలతో రక్తనాళాలు ఆ పూడుకుపోతే గుండె కండరం చచ్చుబడిపోవడం మొదలవుతుంది. అదే 'గుండెపోటు' రూపంలో కనిపిస్తుంది. ఇలాంటి సమయాల్లో ఎంత వేగంగా గుండెకు అందాల్సిన రక్తాన్ని మళ్లీ పునరుద్ధరించగలిగితే అంతగా గుండెపోటు ప్రభావాన్ని తగ్గించవచ్చు. గుండెపోటుకు గురైన వ్యక్తిని వీలైనంత త్వరగా హాస్పిటల్‌కు తీసుకురావాలంటూ వైద్యులు చెప్పేది అందుకే. అయితే కొందరిలో గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ప్రధాన రక్తనాళాలన్నీ పూడుకుపోయి.. హాస్పిటల్‌కు చేరేలోపే గుండె కండరం పూర్తిగా చచ్చుబడిపోతే గుండెకే కాదు గుండె నుంచి మన దేహంలోని ఏ అవయవానికీ రక్తం సరఫరా కాదు. ఇలాంటి సమయాల్లోనే రోగి మరణానికి దారితీసే ప్రమాదకరమైన స్థితి ఉందని కార్డియాలజిస్టులు పేర్కొంటున్నారు. అందుకే ముందు నుంచీ జాగ్రత్తలు తీసుకుంటూ పూడిక ఉన్నప్పుడు స్టెంట్ వేయించడం, రక్తాన్ని పలుచబార్చే మందులు వాడటం, అన్ని ప్రధాన రక్తనాళాలూ పూడుకుపోయినప్పుడు అవసరాన్ని బట్టి గుండె శస్త్రచికిత్స చేయించడం వంటివి అవసరమవుతాయని వైద్యులు పేర్కొంటున్నారు.

మారిన జీవన శైలి, ధూమపానం, మాదక ద్రవ్యాల వినియోగం కొంతమంది యువతలో పెరిగిపోయింది. ధూమపానం వల్ల రక్తాన్ని సరఫరా చేసే నాళాలు కుంచించుకుపోయి గుండె నొప్పికి గురవుతున్నట్లు వైద్యులు తెలిపారు. ఆహార అలవాట్ల కారణంగా కొందరికి చిన్న వయసులోనే గుండె జబ్బులు తలెత్తుతున్నాయి. గుండె రక్తనాళాల్లో పూడికలు (బ్లాక్స్) ఏర్పడి కరోనరీ హార్ట్ డిసీజ్‌కు దారితీస్తోంది. 25 ఏళ్ళ వయసుకే రక్తనాళాల్లో పూడికల కారణంగా గుండె శక్తి సామర్థ్యాలు తగ్గుతున్నాయి. స్టెంట్లు, యాంజియో ప్లాస్టీ చేయించుకునే వారి సంఖ్య పెరుగుతోంది. మధుమేహం, అధిక రక్తపోటు, అధిక బరువు, కొలెస్ట్రాల్ కారణంగానూ గుండె జబ్బులు పెరుగుతున్నాయి. ధూమపానం, పొగాకు ఉత్పత్తులు తీసుకోవడం వల్ల త్వరగా గుండె జబ్బులు వచ్చే ప్రమాదముందని వైద్యులు పేర్కొంటున్నారు.

## పెండ్లి చేసుకోవాలని ఒత్తిడి.. ఒప్పుకోకపోవడంతో హత్య

**మియాపూర్, అక్టోబర్ 5, ప్రభాతవార్త**

హైదరాబాద్ మియాపూర్ పరిధిలో ఇటీవల సంచలనం సృష్టించిన వివాహిత మర్డర్ కేసును పోలీసులు ఛేదించారు. లవ్‌ను యాక్సెప్ట్ చేయలేదని, పెండ్లి చేసుకోలేదనే కక్షతో ఇంటర్ ఫ్రెండ్ విచక్షణారహితంగా రాయితో కొట్టి, స్క్రూడ్రైవర్‌తో ముఖంపై పొడిచి చంపినట్లు తేల్చారు. మియాపూర్ ఇన్స్‌పెక్టర్ దుర్గా రామలింగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం దీప్తీశ్రీనగర్‌కు చెందిన స్పందన (29), వినయ్ కుమార్, గచ్చిబౌలి సుదర్శన్ నగర్ ఆల్‌ఎంఐయూ కాలనీ చెందిన ఎం.మనోజ్ కుమార్ (29) ఇంటర్ మీడియట్ నుంచి ఫ్రెండ్స్. ఆ టైంలో మనోజ్ లవ్ ప్రపోజ్ చేయగా, స్పందన రిజెక్ట్ చేసింది. మనం ఫ్రెండ్స్‌గానే ఉందామని చెప్పింది. తర్వాత వినయ్ కుమార్‌ను ప్రేమించింది. 2022లో పెద్దల అంగీకారంతో పెండ్లి చేసుకుంది. కొన్ని నెలలకే భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో విడాకులకు అప్లయ్ చేశారు. అప్పటి నుంచి స్పందన తన తల్లి, సోదరుడితో కలిసి దీప్తీనగర్‌లోని సీబీఆర్ ఎస్టేట్‌లో ఉంటుంది. వినయ్ కుమార్ అదే కాలనీలోని మరో ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో మనోజ్ కుమార్ స్పందనకు దగ్గరయ్యాడు. తరచూ స్పందన ఇంటికి వెళ్లి తన ప్రేమను యాక్సెప్ట్ చేయాలని, పెండ్లి చేసుకుంటానని వేధించేవాడు. స్పందన తిరస్కరించడంతో పాటు ఇతర ఫ్రెండ్స్, కొలిగ్స్‌తో సన్నిహితంగా ఉండటాన్ని చూసి మనోజ్ జీర్ణించుకోలేకపోయాడు. స్పందనను చంపేయాలని డిసైడ్ అయ్యాడు. గతనెల 30న ఇంట్లో ఒంటరిగా నిద్రపోతున్న స్పందనపై దాడి చేశాడు. గ్రానైట్ రాయితో తలపై కొట్టి, స్క్రూడ్రైవర్‌తో ముఖంపై పొడిచి చంపేశాడు. తర్వాత మెయిన్‌డోర్‌ను బయటి నుంచి లాక్ చేసి పారిపోయాడు. మృతురాలి తల్లి ఫిర్యాదుతో మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలి ఫోన్ కాల్స్‌డేటా, సీసీ ఫుటేజీల ఆధారంగా స్పందనను చంపింది మనోజ్‌కుమార్‌గా గుర్తించారు. అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు.

## కల్తీ అల్లం, వెల్లులి పేస్ట్ తయారు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

-నాలుగు సార్లు పట్టుబడినా మారని వైనం : ప్రజల ప్రాణాలతో చెలగాటం

**ఉప్పల్, అక్టోబరు 5 ప్రభాతవార్త :** ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ నకిలీ అల్లం, వెల్లులి పేస్ట్ తయారు చేసి బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్న ఒక వ్యక్తిని ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కల్తీ అల్లం తయారు చేస్తున్న వ్యక్తిని గతంలో మూడుసార్లు పట్టుకుని కేసులు పెట్టినా తిరిగి అదే ప్రాంతంలో మళ్లీ అదే కల్తీ అల్లం, వెల్లులి పేస్ట్ తయారు చేస్తూ పోలీసులకు చిక్కాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి, ఆగాపురాకు చెందిన మహ్మద్ అప్తాబ్ (30) అనే వ్యక్తి రామంతాపూర్ భగాయత్‌లోని బాలకృష్ణనగర్ ప్లాట్‌నెం. 5లో గత పది సంవత్సరాలుగా న్యూ నేషనల్ పేరుతో అపరిశుభ్రమైన వాతావరణంలో నకిలీ అల్లం, వెల్లులీ పేస్ట్ తయారు చేసి విక్రయిస్తున్నాడు. గతంలో ఎస్‌ఓటి పోలీసులు అతనిని పట్టుకుని కేసులు పెట్టారు. తిరిగి బెయిల్‌పై వచ్చిన అతను అదే దందా ఎంచుకుంటున్నాడు. మూసీ సమీపంలో అపరిశుభ్రమైన వాతావరణంలో అల్లం, వెల్లులి పేస్ట్ తయారు చేస్తున్నాడని, టైటానియం రసాయనం పొడి, సిట్రిక్ యాసిడ్, మోనో హైడ్రేడ్, కొంత అల్లం, వెల్లులి కలిపి కల్తీ అల్లం, వెల్లులి పేస్ట్ తయారు చేస్తున్నాడని పోలీసులు తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి తీవ్ర హాని చేసే ఇటువంటి ఆహార పదార్థాల విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించడకపోవడంతో వ్యాపారులు తిరిగి అదే దందా చేస్తున్నారు. స్థానిక పోలీసులకు దీనిపై తెలిసినా ఇది తమ పని కాదని తప్పించుకుంటున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## యాత్రల పేరుతో ప్రజల నుంచి రూ.2.5 కోట్లు స్వాహా..!

-చీటింగ్ కేసులో వైఎస్‌ఆర్‌టిపి గ్రేటర్ కన్వీనర్ భర్త అరెస్ట్

**ఉప్పల్, అక్టోబరు 5 ప్రభాతవార్త :** ప్రజలను తీర్థయాత్రలకు తీసుకెళుతానని నమ్మించి వారి వద్ద నుంచి రూ.2.5 కోట్ల వసూలు చేసుకుని మోసం చేసిన ఓ రాజకీయ పార్టీ నేత భర్తను ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఉప్పల్ ఎస్ఐ మధు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ కల్యాణపురిలో నివాసం ఉంటే గాయత్రి టూర్స్ అండ్ ట్రావెల్స్ నిర్వహకులు భరత్‌కుమార్‌శర్మ(45) పలు ప్యాకేజీల పేరుతో తీర్థ యాత్రలకు తీసుకెళుతానని ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు తెలిపారు. ఇదే క్రమంలో గత రెండేళ్ల నుంచి పలువురి వద్ద నుంచి భారీ ఎత్తున డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. తన భర్త భరత్‌కుమార్‌శర్మ పేరుతో ట్రావెల్స్ ఏర్పాటు చేసి వైఎస్‌ఆర్‌టిపి కోఆర్డినేటర్ మహిళా నేత చక్రం తిప్పి యాత్రికుల నుంచి డబ్బులు దండుకున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. దేశంలోని మానస సరోవర్, తదితర ప్రదేశాలకు వెళ్లేందుకు ఒక్కొక్కరు రూ.రెండు నుంచి మూడు లక్షలు ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గత రెండేళ్ల నుంచి కరోనా పేరు చెప్పి తప్పించుకుని తిరుగుతున్నారని, తీసుకున్న డబ్బులు తిరిగి ఇప్పించాలని రామంతాపూర్‌కు చెందిన ప్రియారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంకా 150 మందికి డబ్బులు ఇవ్వాల్సి ఉందని పోలీసులు పేర్కొంటున్నారు. దీనిపై విచారణ చేసిన పోలీసులు గాయత్రి టూర్స్ అండ్ ట్రావెల్స్ నిర్వహకులు భరత్‌కుమార్‌శర్మను అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్ చేసినట్లు ఎస్ఐ మధు తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బతుకమ్మ ఉత్సవాల్లో ఆడిపాడిన నగర పోలీస్ బాస్ సివి ఆనంద్



**పంజగుట్ట, అక్టోబర్ 5 (ప్రభాతవార్త):** హైదరాబాద్ సిటీ పోలీస్ తరుపున సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లోని పోలీసు గ్రౌండ్‌లో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. హైదరాబాద్ సిటీ పోలీసుకు సంబంధించిన మహిళా ఉద్యోగులు హోంగార్డు స్థాయి నుండి డిసిపి వరకు మహిళా అధికారులు సుమారు 800 మందిపాల్గొన్నారు. హైదరాబాద్ సిటీ పోలీసు కమీషనర్ సీవీ ఆనంద్, సతీమణి లలితా ఆనంద్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిరువురు ఉద్యోగులందరికీ బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు.

## నార్త్‌సిటీ మెట్రోను సాధించే వరకు పోరాటం కొనసాగిస్తాం -ఎమ్మెల్యే వివేకానంద



ఎమ్మెల్యే వివేకానందను కలిసిన మెట్రో సాధన సమితి సభ్యులు

**పేట్ బషీరాబాద్, అక్టోబర్ 5, ప్రభాతవార్త**

హైదరాబాద్ మహానగరానికి ఉత్తరం వైపు గల నార్త్‌సిటీకి మెట్రోను విస్తరించాలని కోరుతూ నేడు ఉదయం 9 గంటలకు మెట్రో సాధన సమితి ఆధ్వర్యంలో జీడిమెట్ల విలేజ్ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించే మహా ధర్నాకు మద్దతు తెలపాలని ఎమ్మెల్యే వివేకానందను పేట్ బషీరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో కలిసి మద్దుతు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్తర భాగం మరింత వేగవంతంగా అభివృద్ధి చెందాలనే ఆలోచనతో కెసిఆర్ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో జేబిఎస్ నుంచి అల్వాల్ మీదుగా తూముకుంట మార్గంతో పాటు పారడైజ్ నుంచి బోయిన్‌పల్లి, సుచిత్ర, కొంపల్లి మీదుగా మేడ్చల్ వరకు మెట్రో రైలు విస్తరణపై సర్వే సంస్థలకు పనులను అప్పగిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ పనులను పక్కనపెట్టి ఫోర్త్ సిటీ అంటూ నూతన మార్గానికి మెట్రోను విస్తరింస్తుంది. నిత్యం లక్షల మంది ఉద్యోగులు సుచిత్ర, కొంపల్లి, కుత్బుల్లాపూర్ ప్రాంతాల నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. అతివేగంగా అభివృద్ధి చెందుతున్న నార్త్ సిటీకి మెట్రో సాధనకై కృషి చేస్తున్న మెట్రో సాధన సమితికి నా మద్దతు ఎల్లప్పుడు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంపత్, జార్జి, ఒరకుగంటి వెంకట్, పుప్పాల నాగరాజు, మూర్తి, రవి రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ

-కర్బలా మైదానంలో బతుకమ్మ పండుగ ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే తలసాని



నెక్లెస్ రోడ్డులోని కర్బలా మైదానంలో ఏర్పాట్లను అధికార్లతో కల్సి పరిశీలిస్తున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని.

**బేగంపేట అక్టోబరు 5, ప్రభాతవార్త**

ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ అని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం నెక్లెస్ రోడ్డు లోని బుద్ద భవన్ వద్ద కర్బలా మైదానంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించే బతుకమ్మ పండుగ ఏర్పాట్లను వివిధ శాఖల అధికారులతో కల్సి పర్యవేక్షించారు. వేలాది మంది మహిళలు పాల్గొననున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, అధికారులను తలసాని ఆదేశించారు. ముఖ్యంగా బతుకమ్మ పూర్తయ్యే వరకు వాహన దారులు, ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా ట్రాఫిక్ మళ్లించేలా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. బతుకమ్మ ఆడే ప్రాంతం మొత్తం లైట్లను ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అదే విధంగా బతుకమ్మలను నిమజ్జనం చేసే హుస్సేన్ సాగర్‌లోని బతుకమ్మ ఘాట్‌లో కూడా లైట్లను ఏర్పాటు చేయాలని అన్నారు. బతుకమ్మ పాటలతో కూడిన సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలన్నారు. వచ్చిన ప్రజల సౌకర్యార్థం తాగునీటి కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. బతుకమ్మ ఆడే ప్రాంతం, బతుకమ్మ ఘాట్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణా సంస్కృతికి ప్రతీకగా నిలిచే పండుగ బతుకమ్మ అని అన్నారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి 9రోజుల పాటు మహిళలు ఎంతో ఘనంగా జరుపుకుంటారని వివరించారు. ప్రతి సంవత్సరం కర్బలామైదానంలో నిర్వహించే బతుకమ్మ కు వచ్చే మహిళలు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని ఏర్పాట్లను చేస్తూ వస్తున్నామని, ఈ సంవత్సరం కూడా అన్ని ఏర్పాట్లను చేయడం జరుగుతుందని వివరించారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్ర పండుగగా జరుపుకుంటున్న విషయాన్ని గుర్తు చేసారు. ఒక్క తెలంగాణా ప్రాంతానికే పరిమితమైన బతుకమ్మ పండుగ దేశ విదేశాలలో నిర్వహిస్తున్నారని ఇది మన కెంతో గర్వ కారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి, రాంగోపాల్‌పేట మాజీ కార్పొరేటర్ అత్తెల్లి మల్లిఖార్జున్‌గౌడ్, అరుణాగౌడ్, జీహెచ్‌ఎంసీ ఈఈ సుదర్శన్, వాటర్‌వర్క్స్ జీఎం వినోద్, శానిటేషన్ డీఈ దేవేందర్‌రెడ్డి, ఆర్ అండ్ బి డీఈ మనోహర్ బాబు, ఇరిగేషన్ అధికారి శ్యామ్ సుందర్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ సుష్మిత, స్ట్రీట్ లైట్ డీ ఈ ప్రసన్న, లేక్ ఎస్సై కిరణ్, ట్రాఫిక్ సిఐ ఉపాశంకర్, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్‌కుమార్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, ఆకుల హరికృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేషన్‌రాజు, నాయకులు నాగులు, లక్ష్మీపతి, శ్రీహరి, శేఖర్, కిషోర్, మహేందర్, గజ్జెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానంలో దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 3వ రోజు శ్రీ రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మావారు



సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో గాయత్రీదేవి అలంకారంలో అమ్మ వారు

## ఘనంగా దేవినవరాత్రి ఉత్సవాలు

## గంజాయి అమ్ముతున్న వ్యక్తులు అరెస్ట్..

**పంజగుట్ట, అక్టోబర్ 5 9(ప్రభాతవార్త):** జూబ్లీహిల్స్‌లో గంజాయి విక్రేతలను ఎక్సయిజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. జూబ్లీహిల్స్ ఎక్సయిజ్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్డునంబర్ 36 సమీపంలో గంజాయి అమ్మకాలు సాగుతున్నాయనే విశ్వసనీయ సమాచారం మేరకు హైదరాబాద్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, జూబ్లీహిల్స్ ఎక్సయిజ్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. తనిఖీల సమయంలో ఖమ్మం జిల్లా వాసి సూర్య అజయ్, కరీంనగర్ వాసి వర్షిత్, వరంగల్ జిల్లాకు చెందినరాజ్‌కుమార్‌లు అనుమానాస్పదంగా ఉండడంతో వారిని అదుపులోకి తీసుకుని తనిఖీలు నిర్వహించారు. వారి వద్ద 3.4 కేజీల గంజాయితో పాటు 34 గ్రాముల ఓజీ క్రష్ (హైబ్రీడ్ గంజా) లభించినట్లు తెలిపారు. విచారణలో వీరు ఖమ్మం నుంచి గంజా కిలో పదివేలకు కొనుగోలు చేసి హైదరాబాద్‌లోని కస్టమర్‌లకు 20 గ్రాముల పాకెట్ వేయి రూపాయల చొప్పున అమ్ముతుంటామని విచారణలో అంగీకరించారు. వారిని అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుండి రెండు బైక్‌లు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో వాసుదేవరావుతో పాటు ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్ఐలు శ్రీనివాసులు, బ్రహ్మచారి తదితరులు ఉన్నారు.

